సాక్షి ఒడిశా

ఆదివారం । 2 । జులై । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,25,820లు, బంగారం 2.3 గ్రాములు, వెండి 6.7 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



5 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

- 8లో.



హత్య కేసును ఛేదించిన పోలీసులు

- 8లో.

న్యూస్‌రీల్

రంజన్ దాస్‌కు 'పుస్తక మేళా' పురస్కారం



రంజనకుమార్ దాస్‌కు పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

భువనేశ్వర్: సాహితీవేత్త, శ్రీమందిరం ప్రధాన పాలనాధికారి(సీఏఓ) రంజనకుమార్ దాస్‌కు ఈ ఏడాది రాజధాని పుస్తకమేళా పురస్కారం లభించింది. ఆయన రచించిన 'థాయి ఘోరొ జొలేన్' ప్రబంధం ఈ పురస్కారానికి ఎంపిక కావడం విశేషం. రథయాత్ర నిర్వహణలో తలమునకలై ఉండటంతో పురస్కారం ప్రదానోత్సవానికి ఆయన ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయారు. రాజధాని పుస్తక మేళా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఉపేంద్రకుమార్ జెనా, కార్యదర్శి బిధుభూషణ్ పట్నాయక్, కన్వీనర్ రమేష్‌చంద్ర స్వాయి బృందం శనివారం శ్రీమందిరం కార్యాలయం ప్రత్యక్షంగా సందర్శించి సీఏఓ దాస్‌కు పురస్కారం ప్రదానం చేసి, లాంఛనంగా సత్కరించారు.

'అవకతవకలపై దర్యాప్తు జరపాలి'



డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: గుండిచా రథయాత్ర సందర్భంగా అడపా మండపంలో ఏటా 108మంది సేవాయత్‌లు, భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ నిమిత్తం రూ.20 వేలు అందించానని హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి పర్లాకిమిడి జగన్నాథ మందిరం కమిటీ యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 406902010002801లో నగదు జమ చేశామన్నారు. అయితే ఈ ఏడాది అన్న ప్రసాదాలు మాత్రం పంపిణీ చేయలేదని, ఈ సొమ్ములు ఎటు మళ్లించారో ఆలయ కమిటీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గత రెండేళ్లుగా రథాయాత్ర కమిటీ గుండిచా యాత్రలో చేస్తున్న ఖర్చులకు సంబంధించి లోకల్ ఆడిట్ జరగడం లేదన్నారు. దీనిపై 10 రోజుల్లోగా సమాధానం చెప్పని పక్షంలో చట్టపరంగా ఫిర్యాదు చేస్తానని స్పష్టంచేశారు.

ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్‌గా ప్రసన్న మహంతి



శారదాప్రసన్న మహంతి

భువనేశ్వర్: ఒడిశా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ప్రాంతీయ డైరెక్టర్‌గా శారదా ప్రసన్న మహంతి బాధ్యతలు స్వీకరించారు. నియంత్రణ, పర్యవేక్షణ, సాంకేతిక సమాచారం(ఐటీ), కరెన్సీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో ఆయనకు విస్తృత అనుభవం ఉంది. అతను న్యూఢిల్లీ, కోల్‌కత, భువనేశ్వర్ కార్యాలయాలతో పాటు ముంబైలోని ఆర్‌బీఐ ప్రధాన కార్యాలయంలో గతంలో పనిచేశాడు. అమెరికా, స్విట్జర్లాండ్, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్‌లో ఫెడరల్ రిజర్వ్, బాసెల్ కమిటీ, ఇంటర్నేషనల్ కమిటీ ఆన్ క్రెడిట్ రిపోర్టింగ్‌తో సహా వివిధ అంతర్జాతీయ వేదికలలో ఆర్‌బీఐకి ప్రాతినిధ్యం వహించారు. మహంతి ఐఐఎం బెంగళూరు, భువనేశ్వర్ ఓయూఏటీ పూర్వ విద్యార్థి. దేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై పీహెచ్‌డీ చేశారు. అలాగే అమెరికా టెక్సాస్ ఆస్టిన్ విశ్వవిద్యాలయం నుంచి డేటా అనలిటిక్స్‌లో అధునాతన డిగ్రీ కూడా సాధించారు.

శ్రీమందిరానికి చేరుకున్న రథాలు



శ్రీమందిరం వద్దకు చేరిన రథాలు

పర్లాకిమిడి: గుండిచా మందిరం నుంచి రథాలపై బయలుదేరిన సుభద్ర, బలభద్ర, జగన్నాథ మూర్తులు.. మార్గం మధ్యలో మౌసిమా ఘరో వద్ద గత 2 రోజులు విడిది చేశారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం తిరుగు ప్రయాణమై, శ్రీమందిరానికి చేరుకున్నాయి. మూల్ విరాట్ లను రథాల నుంచి శ్రీమందిరం లోపలికి తరలించారు. సోమవారం పౌర్ణమి సందర్భంగా జగన్నాథుడు లక్ష్మీ సమేతంగా లక్ష్మీనారాయణ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.


నయనానందం

నల్లనయ్యా నీలాద్రివిజే



నీలాద్రి విజే మహోత్సవంలో జనసందోహం

- వేడుకగా ముగిసిన జగన్నాథుని వార్షికయాత్ర
- శ్రీమందిరం రత్న వేదికకు చేరుకున్న దేవతామూర్తులు
- ద్వారం వద్దే స్వామి వారిని అడ్డుకున్న మహాలక్ష్మి
- ప్రియ సఖిని రసగుల్లతో బుజ్జగించిన రాధేశ్యాముడు



స్వామికి నివేదించేందుకు రసగుల్ల తీసుకు వస్తున్న సేవాయత్‌లు

భువనేశ్వర్: వార్షిక యాత్ర ముగించుకున్న జగన్నాథుడు.. రథం దిగి శ్రీమందిరం రత్న వేదికను యథాతథంగా అలంకరించాడు. ఈ సందర్భంగా శనివారం నీలాద్రి విజే మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గొట్టి పాహాండితో మూల విరాట్‌లను రథాలపై నుంచి రత్న వేదికకు తరలించారు. తొలుత రామకృష్ణులు, సుదర్శనుడు రథం నుంచి దిగి రత్న వేదికను అలంకరించగా.. బలభద్రుడు, దేవీ సుభద్ర, జగన్నాథుని మూల విరాట్‌ల తరలింపు ప్రారంభించారు. ఒక దేవతామూర్తి గర్భాలయానికి చేరుకున్న అనంతరం.. మరో మూర్తి పాహాండి ప్రారంభించారు. ఈ క్రమంలో బలభద్ర, దేవీ సుభద్రలు ఎటువంటి అడ్డంకి లేకుండా జయ విజయ ద్వారం మీదుగా రత్న వేదికను అధిష్ఠించారు. వీరి తర్వాత లోపలికి ప్రవేశించేందుకు రథం దిగిన జగన్నాథునికి ప్రవేశం కొరవడింది. స్వామి పట్ల విరహ వేదన, ఆగ్రహంతో లోపలికి రాకుండా మహాలక్ష్మి అడ్డుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సుదీర్ఘ బుజ్జగింపుతో నచ్చజెప్పినా ప్రయోజనం లేకపోవడంతో స్వామి రుచికరమైన రసగుల్లను తినిపించి, మురిపించడంతో అత్యంత ఆప్యాయంగా ఆహ్వానించిన అమ్మవారు.. రత్న వేదికపై అధిష్ఠించేందుకు మార్గం చూపారు. అశేష భక్తజనం నీలాద్రి విజే మహోత్సవం తిలకించేందుకు తరలివచ్చారు. రథాలపై దేవుళ్లకు రసగుల్ల నైవేద్యంగా సమర్పించారు.


రసగుల్ల దివస్..

రసగుల్ల మాధుర్యం విభిన్నం. ఏటా నీలాద్రి విజే పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా రసగుల్ల దివస్ వేడుకగా జరుపుతారు. పూరీ జగన్నాథుని రథయాత్రలో నీలాద్రి విజే అంతిమ ఘట్టం. ఈ సందర్భంగా రథంపై దేవుళ్లకు రసగుల్ల నైవేద్యంగా సమర్పిస్తారు. తోబుట్టువులతో నవ దినాత్మక యాత్రకు వెళ్లిన జగన్నాథుడు మహాలక్ష్మిని విస్మరించడంతో విరహ వేదన తాళలేక మందిరంలోకి స్వామిరాకను దేవీ అడ్డుకుంటుంది. ప్రియ సఖిని బుజ్జగించి లోపలికి ప్రవేశించేందుకు జగన్నాథుడు రసగుల్ల మిఠాయితో మురిపిస్తారు. దీంతో సింహద్వారం తలుపు తెరిచి, ప్రియుని సాదరంగా ఆహ్వానించడంతో రథయాత్ర ముగుస్తుంది. జగన్నాథుని సంస్కృతితో రసగుల్ల మాధుర్యం ఇలా ముడిపడి ఉంది.



మూల విరాట్‌ల పాహాండి స్వాగత ఘంటానాదం

'జీఐ' గుర్తింపుతో..



పూరీ సాగరతీరంలో సుదర్శన్ పట్నాయక్ ఆవిష్కరించిన సైకతశిల్పం

రసగుల్ల దివస్ ఆధారంగా ఈ మిఠాయి జీఐ ట్యాగ్ సాధించింది. పొరుగు రాష్ట్రం పశ్చిమ బెంగాల్‌తో తలపడి ఈ హోదా దక్కించుకోవడంతో నీలాద్రి విజేను రసగుల్ల దినంగా ప్రకటించారు. క్రమంగా దేశవ్యాప్తంగా రాష్ట్రేతర ప్రాంతాలు రసగుల్ల దినం పట్ల మక్కువ కనబరుస్తున్నాయి. 2015 జులై 4న రసగుల్ల దినోత్సవం వేడుక ప్రారంభమైంది.



రథం దిగుతున్న బలభద్ర స్వామి



నందిఘోష్ రథం దిగుతున్న జగన్నాథుడు



స్వామిని అడ్డుకునేందుకు బయల్దేరుతున్న మహాలక్ష్మి

రజత స్వాగతం..

రథయాత్ర పురస్కరించుకుని అడప మండపానికి వెళ్లిన జగన్నాథుడు.. శనివారం రాత్రి తిరిగి రత్నవేదిక అధిష్ఠించాడు. స్వామి ఆగమనం పురస్కరించుకుని శ్రీమందిరం సింహద్వారం ప్రత్యేకంగా ముస్తాబైంది. పునరుద్ధరణ కార్యకలాపాల్లో భాగంగా సింహ ద్వారంతో పాటు పలు ద్వారాలకు వెండి తాపడం చేపట్టారు. భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ) గతంలో ప్రకటించిన ప్రకారం నీలాద్రి విజే పురస్కరించుకుని స్వామి విచ్చేయడానికి ముందే ఈ పనులు పూర్తిచేశారు. పాత ద్వారం, తలుపులు తొలగించి బర్మా టేకుతో కొత్తగా చేసిన తలుపులను అమర్చారు. వీటిపై వెండి తాపడం పనులు చేపట్టారు. వీటిపై వెండితో చేసిన శంఖం, చక్రం, గద, పద్మం, సింహాలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ముంబై నుంచి వచ్చిన 13మంది కార్మికులు ఈ పనుల్లో పాల్గొన్నారు. మరోవైపు సింహద్వారం పుష్ప శోయగంతో గుభాలించింది. సుగంధ పర్యావరణంలో రజత ద్వారం మీదుగా జగన్నాథునికి ఘనంగా స్వాగతించి అంతరాలయం రత్న వేదికపై యథాతథంగా అధిష్ఠించారు.



వెండి వెలుగుల్లో శ్రీమందిరం సింహద్వారం



22 భుజాల నృసింహుడు | ప్రలంబరి | గజాంతక | లక్ష్మణ-అంగద | కార్తికేయ | శంకర్షణ-వాసుదేవ | నాట్యంబర | నృత్య గణపతి | బలరాం

తాళ ధ్వజం.. బలభద్రుని రథం తాళ ధ్వజం. దీని ఎత్తు 43 అడుగులు. 14 చక్రాలు ఉంటాయి. రథం అలంకరణలో ఎరుపు, ఆకుపచ్చ రంగుల వస్త్రాలు వినియోగిస్తారు. ద్వారపాలకులు నంద–సునంద. రథం రక్షకుడు వాసుదేవ్. సారథి మాతాలి. రథం శిఖరాన రెపరెపలాడే పతాకం యునాని. రథం తాడు వాసుకి నాగ. 4 నల్లని గుర్రాలు తీవ్ర, ఘోర, దీర్ఘాశ్రమ, స్వర్ణావ, 9 పార్శ్వ దేవతలు రథం ఇరువైపులా చోటు చేసుకుని ఉంటాయి.

వన మహోత్సవానికి శ్రీకారం



మొక్కలు పంపిణీ చేస్తున్న డీఎఫ్‌ఓ ఆనంద్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో వన మహోత్సం కార్యక్రమానికి అటవీశాఖ అధికారి ఎస్.ఆనంద్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా మొక్కల పంపిణీకి సంబంధించి 7సంచార వాహనాలను శనివారం జెండా ఊపి, ప్రారంభించారు. చెట్టు లేనిదే మనిషి జీవన మనుగడ సాధ్యం కాదని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సమితి స్థాయిలో మొక్కలు నాటేందుకు వీలుగా ఈ వాహనాలు ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని నలుగురుకి ప్రకృతి మిత్రా అవార్డులను అందజేశారు. పర్లాకిమిడి నుంచి గోపాల శత్పతి, మోహానా సమితిలో ప్రేమానంద పూజారి, రాయఘడ సమితికి ఎం.వెంకట్రావు అప్పన్న, గుమ్మా సమితికి నాగేశ్వర మహాపాత్రొ లకు ప్రశంసా పాత్రాలతో పాటు రూ.10వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ ఏసీఎఫ్ అరుణ్‌కుమార్ సాహు, బనాంచల్ అధికారి ఎన్‌డీశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చేతబడి నెపంతో హత్య

జయపురం: మూఢ నమ్మకాలు మరో వ్యక్తి ప్రాణం తీశాయి. చేతబడి పేరుతో గ్రామస్తుల మృతికి కారణమవుతున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని గ్రామస్తులు గొడ్డలితో నరికి చంపారు. బొయిపరిగుడ సమితి ధనివలస గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ హత్యలో బలరాం ఖొర అనే వ్యక్తి మృతిచెందాడు. గ్రామంలో గత 5 నెలల కాలంలో ఐదుగురు వ్యక్తులు మృతి చెందగా.. దానికి ఖొర కారణమని ఆరోపిస్తూ అతనితో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు.. గొడ్డలితో దాడి చేశారు. ప్రాణ భయంతో అతను పరుగులు తీయగా, హరి ఖొర, డొంబురు ఖొర, అర్జున ఖొర, ఆదియ ఖొర వెంబడించి హతమార్చారు. ఈ మేరకు మృతుడి భార్య మంగులి శనివారం బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు చేస్తున్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ధ్రువపత్రాలతో వక్తృత్వ, ప్రబంధాల పోటీల విజేతలు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని మహేంద్రగిరి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఒడిశా సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారు. అకాడమీ సభ్యుడు బిచిత్రానంద బెబర్తా ఆధ్వర్యంలో వక్తృత్వం, ప్రబంధాలు, కవిత, సాహిత్యం, ఇంగ్లిషు–ఒడియా అనువాద పోటీలు చేపట్టారు. ఇందులో 56మంది పాల్గొన్నారు. ప్రథమ స్థానం పొందిన జూనియర్, సీనియర్ బృందాలు.. భువనేశ్వర్ లోని ఉత్కళ సంగీత మహావిద్యాలయంలో ఈనెల 9, 10 తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ప్రకటించారు. జిల్లా సాంస్కృతిశాఖ అధికారి అర్చనా మంగరాజ్, మహిళా విద్యాలయం లెక్చరర్ డాక్టర్ కల్యాణీ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి గుర్తింపు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గౌరీశ్వరరావు

విజయనగరం టౌన్: విజయనగరం మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల విద్యార్థులకు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. విద్యార్థులను కళాశాల ఆవరణలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పి.గౌరీశ్వరరావు శనివారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల భువనేశ్వర్ ఐఐటీలో ఏఐసీటీఈ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ క్యాంప్‌లో కళాశాల విద్యార్థులు ఎస్.కామేశ్వరి, శార్వాణి, వి.మల్లేశ్వరి, వి.నందు, కె.విజయ్ పాల్గొని ప్రతిభ చూపి ప్రశంసలు అందుకున్నారన్నారు.

వెయిట్ లిఫ్టర్‌కు అభినందన

నెల్లిమర్ల రూరల్: జాతీయ స్థాయి ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్యపతకం సాధించిన నెల్లిమర్ల పట్టణానికి చెందిన బైరెడ్డి రాజేశ్వరిను జ్యూట్ కార్మిక నాయకుడు కిల్లంపల్లి రామారావు శనివారం అభినందించారు. నగర పంచాయతీ పరిధిలోని బైరెడ్డి వీధిలో రాజేశ్వరి నివాసానికి వెళ్లి దుశ్శాలువతో సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గురుకులాల్లో ప్రవేశానికి 4న కౌన్సెలింగ్

విజయనగరం ఫూల్‌బాగ్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో 2023–24 విద్యాసంవత్సరానికి జూనియర్ ఇంటర్మీడియట్‌లో అన్ని గ్రూప్స్‌లో మిగిలి ఉన్న సీట్ల కోసం ఈ నెల 4న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని గురుకులాల సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. బాలురకు కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలోను, బాలికలకు నెల్లిమర్లలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడానికి అర్హత గల పాఠశాల సహాయకుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను, పాఠశాల సహాయకులు (మేథ్స్, ఇంగ్లీష్, పీడీ) పదోన్నతుల కోసం అర్హత గల ఎస్జీటీ అభ్యర్థుల తాత్కాలిక జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈఓ బి లింగేశ్వర రెడ్డి శనివారం ఒకప్రకటనలో తెలిపారు.కావున సదరు ఉపాధ్యాయులు గమనించి సీనియారిటీ లిస్టుపై తమ అభ్యంతరాలను డీఈఓ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. httpr://riter.goofe.com/rite/doevizianafaram/ వెబ్‌సైట్‌ను పొందుపరిచామని ఈనెల మూడోతేదీలోగా అబ్జెక్షన్స్ తెలియజేయాలని కోరారు. 4వతేదీన గ్రేడ్–2హెచ్ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్కూల్‌అసిస్టెంట్‌లకు సంబంధించి ఈనెల 5వతేదీన కౌన్సెలింగ్ డీఈఓ కార్యాలయంలో ఉంటుందన్నారు. కావున సదరు సీనియారిటీ జాబితాలో గల ఉపాధ్యాయులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్, సర్వీస్ రిజిస్టరుతో హాజరుకావాలని స్పష్టం చేశారు.

పూరిల్లు దగ్ధం



కాలి బూడిదైన పూరిల్లు, సామగ్రి

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేటలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు కాలిపోయింది. గ్రామానికి చెందిన మిత్తి రెడ్డి చిట్టిబాబు నివాసం ఉంటున్న పూరింటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంటిలో ఉన్న వంటసామగ్రి, బట్టలు, గ్యాస్,టీవీ, ఫ్రిజ్, డాక్యుమెంట్స్ కాలి బూడిదయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామసర్పంచ్ గేదెల ఈశ్వరరావుతో పాటు పెద్దలు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు.అయినా ఫలితం లేకపోయింది. రూ.2లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు, స్థానికులు చెబుతున్నారు.

ఏపీపీఎస్సీ కంప్యూటర్ అసిస్టెంట్ జాబితా విడుదల

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2021 డిసెంబర్ 28న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి సంబంధించి ప్రొఫెషియన్సీ ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ విత్ యూజ్ ఆఫ్ కంప్యూటర్ అసోసియేటెడ్ సాఫ్టవేర్ పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు సంబంధించి 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి విజయనగరం జిల్లా వెబ్‌సైట్‌లో జాబితాను పొందుపరిచినట్లు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ తేదీ, సమయం, ప్రదేశం తదితర వివరాలను తరువాత తెలియజేయనున్నామని వివరించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- మే 13న హత్యకు గురైన ఆశా సంస్థ డైరెక్టర్ గౌరీప్రసాద్ మిశ్రా
- నిందితుల అరెస్ట్.. భూ వివాదాలే కారణమని వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, వెనుక ముసుగుల్లో నిందితులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న ఆశా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గౌరీప్రసాద్ మిశ్రా హత్య కేసును పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి నిందితులను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. భూ వివాదాలే హత్యకు ప్రధాన కారణమని జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ వెల్లడించారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన తెలియజేశారు. మే 13న రాత్రి 9గంటల సమయంలో గుణుపూర్ లోని వంశధార నది సేద తీరుతున్న గౌరీప్రసాద్‌ను గుర్తు తెలియని దుండగులు తుపాకీతో కాల్చి హత మార్చారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ఇందులో విశాఖపట్నానికి చెందిన రాజేటి కృష్ణ ప్రధాన నిందితుడిగా తేలింది. ఇరువురికీ మధ్య గత కొంతకాలంగా భూ తగాదాలు ఉండటంతో హత్యకు పథకం సిద్ధం చేశాడు.

డబ్బులు ఇస్తానని నమ్మబలికి..

ఈ నేపథ్యంలో విశాఖపట్నానికి చెందిన వడ్డాది రాజేష్, మరి కొందరు వ్యక్తులతో కలిసి గౌరీప్రసాద్ మిశ్రాను హతమార్చేందుకు రేజేటి కృష్ణ రూ.15 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు అందించాడు. ఈ మేరకు మే 13న పక్కాగా ప్లాన్ వేసి, నది వద్ద ఒంటరిగా సేద తీరుతున్న ఆశా డైరెక్టర్‌ను తుపాకీతో కాల్చి చంపారు. అనంతరం ఒప్పందం ప్రకారం మిగతా సొమ్ము ఇవ్వాలని రాజేష్ డిమాండ్ చేశాడు. లేనిపక్షంలో పోలీసులకు విషయం చెబుతానని బెదిరించాడు. దీంతో అతనిని కూడా వదిలించు కోవాలని భావించిన కృష్ణ.. డబ్బులు ఇస్తామని నమ్మబలికి, విశాఖపట్నం రావాల్సిందిగా చెప్పాడు. జూన్ 18న రాజేష్ విశాఖకు వెళ్లగా.. కృష్ణ, అతని బంధువు గోవిందతో కలిసి ముగ్గురూ కారులో సత్తారువు–సింహాచలం వైపు ప్రయాణించారు. మార్గం మధ్యలో ఫుల్లుగా మద్యం తాగించి, మత్తెక్కిన తరువాత హతమార్చారు. అయితే రాజేష్ ముందుగానే తన తల్లి లక్ష్మితో విషయం చెప్పడం, అతని ఫోన్ స్విచాఫ్ రావడంతో అనుమానం వచ్చిన ఆమె.. 19న గుణుపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు గౌరీమిశ్రా హత్యకు సంబంధించి ప్రధాన నిందితులను అరెస్ట్ చేశారు. హత్యకు వినియోగించిన 2 తుపాకులు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు

నిందితుల వివరాలు..

గౌరీ మిశ్రా హత్య కేసుకు సంబంధించి ఎస్పీ నిందితుల వివరాలు వెల్లడించారు. కేసులో అరెస్టయిన వారిలో రేగెశెట్టి కృష్ణ, ఆకుల గోవింద, దాసరి వెంకటరావు, ఆకాస్‌కుమార్ బడపాపు, వినోద్ భౌరి, కట్టపల్లి అరుణ్‌కుమార్ అలియాస్ చంటీ ఉన్నారు. ఇదే హత్య కేసుకు సంబంధించి మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని ఎస్పీ వివరించారు.

మావోయిస్టుల దుశ్చర్య

- రైల్వే లైన్ పనులు చేస్తున్న ప్రైవేటు వాహనాలకు నిప్పు
- పర్యావరణం కలుషితమవుతోందంటూ హెచ్చరిక



ఘటనా స్థలం వద్ద అతికించిన పోస్టర్

రాయగడ: జిల్లాలోని మునిగుడకు 7 కిలోమీటర్ల దూరంలోని దేవకుపిలి ప్రాంతంలో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ సంస్థకు చెందిన క్రసర్‌లో నిలిపి ఉన్న వాహనాలకు మావోయిస్టులు నిప్పంటించారు. శుక్రవారం అర్ధరాత్రి సాయుధులైన 10మందికి పైగా మావోయిస్టులు ఈ దాడిలో పాల్గొన్నగా, వీరిలో ఇద్దరు మహిళలు సైతం ఉన్నట్లు సమాచారం. క్రసర్‌లోని 2 పొక్లెయినర్‌లు, 5 హైవాలు మరో 2లోడర్ యంత్రాలకు నిప్పు పెట్టి, తగులబెట్టారు. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గత కొన్నాళ్లుగా దేవకుపిలి ప్రాంతంలో ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ సంస్థ రైల్వే మూడో లైన్ నిర్మాణంలో భాగంగా పనులు నిర్వహిస్తోంది. అయితే పనుల కారణంగా పర్యావరణం కలుషితమవుతోందని వెంటనే నిలుపుదల చేయాలని పలుమార్లు మావోయిస్టులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వాహనాలకు నిప్పంటించి, దహనం చేశారు. సమీపంలోని గోడలపై బఘునా డివిజనల్ కమిటీ పేరిట పోస్టర్లు అతికించి, వెళ్లారు. ఇందులో... దేవకుపిలిలోని సంస్థకు చెందిన క్రసర్ కారణంగా పర్యావరణం పూర్తిగా కలుషితం అవుతోందని, వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్ము, ధూళితో పంటపొలాలు పాడైపోతున్నాయని, రోడ్లు దెబ్బ తింటున్నాయని, శ్రామికులకు పనులు కూడా కరువతున్నాయని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు శనివారం ఉదయం ఘటన స్థలానికి చేరుకుని పోస్టర్లు స్వాధీనం చేసుకున్నారు.

గాలింపు చర్యలు ముమ్మరం..

మునిగుడ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవకుపిలి ప్రాంతంలో దుశ్చర్యకు పాల్పడిన మావోయిస్టుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ తెలిపారు. ఈ మేరకు డీపీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టుల దుశ్చర్యలకు కళ్లెం వేస్తామని, ఎవరూ భయాందోళనకు గురికావద్దని భరోసా ఇచ్చారు. సమగ్ర దర్యాప్తు జరిపి, చర్యలు తీసుకుంటామని వివరించారు.

డంప్ స్వాధీనం..

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి జొడాంబ్ పంచాయతీ పరిధిలో చిత్రకొండ బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసులు సంయుక్తంగా చేపట్టిన కూబింగ్‌లో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను స్వాధనం చేసుకున్నారు. ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని ఆరింగిపడ్, డబుగూడ పరిసరాల్లోని అటవీ ప్రాంతాల్లో దీనిని గుర్తించారు. ఇందులో కరెంట్ వైర్లు, ఎస్ఎల్ఆర్ తుపాకులు, తూటాలు, జిలిటెన్ స్టిక్స్, ఐఈడీ బాంబులు, దుస్తులు, టార్పాన్లు, సెల్‌ఫోన్ చార్జర్లు, తదితర సామగ్రి ఉన్నాయి. డంప్ ఆంధ్ర–ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీకి చెందినదిగా భావిస్తున్నారు. స్థానిక గిరిజనుల సహకారంతో దీనిని భద్రపరిచినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నామని జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వని తెలిపారు. అలాగే గాలింపు ముమ్మరం చేశామని ప్రకటించారు.



మావోయిస్టులు తగులబెట్టిన వాహనాలు



మల్కన్‌గిరి: జవాన్లు స్వాధీనం చేసుకున్న డంప్

5 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

- నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు
- ట్రక్కు, వాహనాలు సీజ్

బరంపురం: కొందమాల్, గజపతి, గంజాం, కొరాపుట్ జిల్లాల సరిహద్దుల్లో మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. ఈ తరుణంలో వివిధ ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న 5క్వింటాళ్లకు పైగా గంజాయిని పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అలాగే నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొందమాల్ జిల్లా పరింగియా నుంచి బరంపురం నగర శివారు 16వ నంబర్ జాతీయ రహదారిలో ట్రక్కుతో గంజాయి రవాణా జరుగుతున్నట్లు ఎస్‌డీపీఓ తపన్‌కుమార్ నాయక్‌కు సమాచారం అందింది. ఈ మేరకు కళింగా ఘాటీలో రెక్కీ నిర్వహించి, అటుగా వస్తున్న వాహనాలు తనిఖీ చేశారు. ట్రక్కుపై దాడి చేయగా 378 కిలోల గంజాయి పట్టుబడింది. వాహనంలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, మరో నలుగురు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పరారయ్యారు. ఘటనపై కేసు నమోదు చేసి, మిగతా వారి కోసం గాలిస్తున్నామని ఎస్‌డీపీఓ తెలిపారు. అలాగే వాహనాలు, గంజాయిని సీజ్ చేశామన్నారు.

ఇంట్లో ఆకస్మిక దాడులు..

కొరాపుట్: జిల్లాలోని మహాడా గ్రామంలో జయరాం బడనాయక్ అనే వ్యక్తి ఇంట్లో పోలీసులు శనివారం ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఇందులో 113కిలోల గంజాయి పట్టుబడింది. విషయం ముందుగానే గ్రహించిన నిందితుడు పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన మాచ్‌ఖండ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



జయపురం: గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

బొయిపరిగుడ పరిధిలో..

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొయిపరిగుడ ఎక్సైజ్ సిబ్బంది బైక్‌పై తరలిస్తున్న 15.2 కిలోల గంజాయిని పట్టుకున్నారు. వీటిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని బొయిపరిగుడ అధికారి శరత్‌చంద్ర బారిక్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు మాలిగుడ జంక్షన్‌లో మాటు వేయగా, బైక్‌పై ఇద్దరు వ్యక్తులు బస్తాల్లో గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు బొయిపరిగుడ పోలీసు స్టేషన్ పరిధి ఉచ్చలగుడ గ్రామానికి చెందిన బలరాం పంగి(31), దేవగుడకు చెందిన భీమ గౌఢ(27)ను అరెస్ట్ చేశామన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి, సరుకును స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఏఎస్ఐ హల్దర్ జానీ, కానిస్టేబుళ్లు రఘునాథ్ హంతాల్, హీరామణి పాత్రొ, మహేష్‌కుమార్ బెహరా, రౌత్ దీనబంధు తదితరులు పాల్గొన్నారు.



కొరాపుట్: బడానాయక్ ఇంట్లో లభ్యమైన గంజాయి



పట్టుబడిన గంజాయితో పరింగియా పోలీసులు

గోస్తనీలో పడి యువకుడి మృతి

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తు గోస్తనీ నదిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌కోట ఎస్సై తారకేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన టీకుబోయిన నాయుడు(23) గొర్రెల మందను శుక్రవారం మేతకు తోలుకువెళ్లాడు. రాత్రికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు వెదకడం ప్రారంభించారు. ఈ క్రమంలో గోస్తనీనదిలోని గోతిలో పడి ప్రాణాలు వదిలినట్లు గుర్తించారు. దీంతో మృతుడి తండ్రి టీకుబోయిన చినకోటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



శృంగవరపుకోట: టీకు బోయిన నాయుడు మృతదేహం

గోతిలో పడి మరో వ్యక్తి..

బొబ్బిలి: విశాఖ నుంచి బైక్‌పై మండలంలోని గున్నతోట వలస వెళ్లే రహదారిలో ద్విచక్రవాహనంపై వస్తున్న గున్నతోట వలస గ్రామానికి చెందిన కెల్ల శ్రీనివాసరావు(54) రోడ్డు మలుపు పక్కనే ఉన్న కల్వర్టు గోతిలో పడి మృతి చెందినట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. విశాఖలో ఉంటున్న శ్రీనివాస రావు యాక్టివా బండిపై వస్తూ గ్రామం దగ్గరకు వచ్చాక ప్రమాదంలో తలకు గాయమై మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చదలవాడ తెలిపారు.



బొబ్బిలి: శ్రీనివాసరావు(ఫైల్)

కొరటాంలో విషాదఛాయలు

తెర్లాం: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని సాహితీ ఫార్మా కంపెనీలో శుక్రవారం జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో తెర్లాం మండలం కొరటాం గ్రామానికి చెందిన ఉప్పాడ తిరుపతి(28) మృతి చెందిన విషయం తెలియడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ఉప్పాడ తిరుపతి నాలుగేళ్లుగా అనకాపల్లి సెజ్‌లోని సాహితీ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో ఉండగా రెండు రియాక్టర్లు పేలి ఎగిసిపడిన మంటల్లో తిరుపతి చిక్కుకుని మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు అచ్యుతాపురంలో నివాసముంటున్నారు. గ్రామంలో మృతుని తల్లిదండ్రులు రాము, తౌడమ్మ ఉంటున్నారు. ప్రమాదంలో కుమారుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో అందరితో కలిసిమెలిసి ఉండే తిరుపతి మృతి చెందడంతో గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు.



ఉప్పాడ తిరుపతి(ఫైల్)

కారు బోల్తాపడి యువకుడు..

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో శుక్రవారం రాత్రి కారు బోల్తా పడడంతో బొబ్బిలికి చెందిన గుంటిరెడ్డి ఉదయ కుమార్(27) మృతిచెందాడు. మధురవాడ నుంచి రాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో అయిదుగురు స్నేహితులు కారులో బీచ్‌రోడ్డులో భీమిలి వస్తున్నారు. ఎర్ర మట్టి దిబ్బలు దాటిన తర్వాత అతివేగంగా వెళ్తున్న కారు సమీపంలోని మలుపు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉదయకుమార్ తీవ్ర గాయలపాలై సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ యువకుడు విశాఖలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంకా వివాహం కాలేదు. కారు నడుపుతున్న యదుభూషణ్‌కు చెయ్యి విరిగింది. కారులో ఉన్న వెంకటరమణ, ఆనందరాజు, శ్రావణకుమార్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం గీతం ఆస్పత్రికి తరలించారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉదయకుమార్ (ఫైల్)

నూనె మీద పడి మహిళకు తీవ్రగాయాలు

జామి: మండలంలోని భీమసింగి జంక్షన్‌లో పకోడీలు,బజ్జీలు అమ్ముకునే ఎస్.స్వాతి నూనె మీద పడడంతో శనివారం తీవ్ర గాయాలపాలైంది. జంక్షన్‌లో పకోడీలు వేస్తున్న సమయంలో కొత్తవలస నుంచి వస్తున్న లారీ అదుపుతప్పి పకోడీలు వేస్తున్న పొయ్యిని ఢీకొట్టడంతో వేడి నూనె ఆమెపై పడిపోంది. దీంతో తీవ్ర గాయాల పాలైన ఆమెను 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు

విజయనగరం క్రైమ్: ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేద్దామని భావించిన మహిళ మోసపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కణపాకకు చెందిన మల్లేశ్వరి మహిళల బ్యాగ్‌లు, బ్రాండెడ్ వస్తువుల అమ్మకాలు చేపట్టింది. ఈ నెల 20న ఆన్‌లైన్‌లో కొన్ని వస్తువులు ఆమెకు నచ్చడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించింది. 21వ తేదీన ఆ కంపెనీకి చెందిన వ్యక్తి ఫోన్ చేసి వస్తువుల ఫొటోలను వాట్సాప్ ద్వారా పంపించాడు. వాటిని బల్క్‌గా తీసుకువచ్చేందుకు కొంత నగదు పంపించాలని కోరాడు. అందుకు కొన్ని ఫేక్ సర్టిఫికెట్‌లు, బిల్లులు పంపించి నమ్మబలికాడు. దీంతో ఆమె మూడు దఫాలుగా రూ.లక్షా 13వేల 60 నగదు పంపించింది.తర్వాత అవి రాకపోయేసరికి ఫేక్ బిల్లులుగా గుర్తించి వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్: వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఇండియన్ మెడికల్ అసోసియేసిన్ రాష్ట్ర అధ్యక్షుడు ముర్రు జయచంద్ర నాయుడు అన్నారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని ఆయన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య పెరగడం వల్ల ఎక్కువ మంది విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని వెల్లడించారు. వైద్యులు రోగుల ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించే విధానం గొప్పదన్నారు. 20 బెడ్స్‌తో ఉండే ఆస్పత్రులు, క్లినిక్‌లకు వివిధ నిబంధనల నుంచి మినహాయింపు ఇస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 2008 సంవత్సరంలో దేశంలోనే మొదటిసారిగా వైద్యులు, ఆస్పత్రులపై దాడుల నిరోధానికి చట్టం తీసుకువచ్చారన్నారు. ఆ తర్వాత 14 రాష్ట్రాలు ఇదే విధమైన చట్టాన్ని అమలులోకి తెచ్చాయన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా రోగుల ప్రాణాలు కాపాడడానికే వైద్యులు ప్రయత్నిస్తారని తెలిపారు.

అనాథలను ఆదుకోవడంలోనే సంతృప్తి



అనాథబాలలకు సమకూర్చిన నిత్యావసర సరుకులతో జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, గణేష్

- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి

బొండపల్లి: అనాథులు, పేదలను ఆదుకోవడంలోనే సంతృప్తి లభిస్తుందని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి జన్మదినాన్ని మండలంలోని ఒంపల్లి గ్రామంలోని శాంతినివాస్ అనాథ ఆశ్రమంలో శనివారం నిర్వహించారు. అనాథ బాలలకు మిఠాయిలు పంచిపెట్టారు. 130 మంది అనాథలకు రూ.లక్ష విలువైన నెలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వాతిరాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా అనాథలు, వృద్ధులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుల్లిపల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

14 తులాల బంగారం చోరీ

రాజాం సిటీ: పట్టణపరిధి బొబ్బిలి రోడ్డులోని ఫైర్ స్టేషన్ సమీపంలో ఓ ఇంట్లో శుక్రవారం రాత్రి 14 తులాల బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు ఎస్సై వై.రవికిరణ్ శనివారం తెలిపారు. రెడ్డి నాగేశ్వరరావుకు చెందిన ఇంట్లోకి అర్ధరాత్రి దాటిన తరువాత వెనుక నుంచి చొరబడి దొంగతనానికి పాలపడ్డారన్నారు. తెల్లవారు జామున కుటుంబసభ్యులు లేచేసరికి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు తెలుసుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో క్లూస్ టీం సహాయంతో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తుచేపట్టి వివరాలు సేకరించామని ఎస్సై చెప్పారు. ఈ చోరీలో 14 తులాల బంగారంతో పాటు ఐఫోన్ పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

శివాలయంలో హుండీ..

మండల పరిధి మొగిలివలస జంక్షన్ వద్ద ఇటీవల నిర్మించిన శివాలయంలో హుండీ చోరీకి గురైందని గ్రామానికి చెందిన లెంక సింహాద్రినాయుడు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. గత నెల 30న అర్ధరాత్రి దాటిన తరువాత ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళాలు పగలగొట్టి హుండీ అపహరించుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. నూతనంగా ఆలయాన్ని నిర్మించడంతో ప్రస్తుతం హుండీలో రూ. 6వేల వరకు ఉంటుందని తెలిపాడని ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, క్లూస్‌టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

సిక్కోలు యువకుడికి రష్యా వర్సిటీ గోల్డ్‌మెడల్



ప్రవీణ్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్ అందిస్తున్న రష్యా యూనివర్సిటీ రెక్టార్

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన సీపాన ప్రవీణ్‌కుమార్ రష్యాలోని యూరల్ ఫెడరల్ యూనివర్సిటీలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఎనర్జీ సిస్టమ్స్, కాంప్లెక్సెస్ విభాగంలో పీహెచ్‌డీ చేసినందుకుగాను ఈ పతకం ప్రదానం చేశారు. ఈయన ప్రస్తుతం ఇదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి సీపాన వరహ నర్సింహం ఆర్మీ రిటైర్డ్ మేజర్. తల్లి లక్ష్మి గృహిణి. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ను పలువురు అభినందించారు.

సేవలే గుర్తింపునిస్తాయి



హోంగార్డు కృష్ణమూర్తిని సత్కరించి చెక్ అందజేసిన ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సుదీర్ఘకాలం పాటు విధులు నిబద్ధతతో నిర్వర్తించడం అభినందనీయమని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. హోంగార్డు యూనిట్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎస్.కృష్ణమూర్తిని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో దుశ్శాలువతో సన్మానించారు. తక్షణ ఆర్థికసాయం కింద రూ. 5 వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎటువంటి సహాయం అవసరమైనా జిల్లా పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, ఆర్ఐలు బి.ప్రదీప్, ఉమామహేశ్వరరావు, హోంగార్డు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాజేశ్వరికి రజతం




జాతీయ పతాకంతో రాజేశ్వరి

ఎచ్చెర్ల క్యాంపస్: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట గ్రామానికి చెందిన సనపల రాజేశ్వరి ప్రతిభ కనబరిచింది. ఆస్ట్రియాలో శుక్ర, శనివారాల్లో జరిగిన సూపర్ ఉమెన్ గ్రాండ్‌ప్రిక్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఇండియా స్పోర్ట్సు క్లబ్ తరఫున ప్రాతినిధ్యం వహించి 87 కిలోల విభాగంలో 155 కిలోల బరువు ఎత్తి రజత పతకం సాధించింది. ఈమెను గ్రామస్తులు అభినందించారు.

డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం డిగ్రీ మూడు, ఐదు సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మూడో సెమిస్టర్ సప్లిమెంటరీలో 3296 మందికి 1620 మంది ఉత్తీర్ణత సాధించారు. బీఏలో 386 మందికి 193 మంది, బీఎస్సీలో 2391 మందికి 1116, బీబీఏలో రెండుకు రెండు, బీసీఏలో రెండుకు రెండు, బీకాం జనరల్‌లో 255 మందికి 145, బీకాం ఒకేషన్ 260 మందికి 162 ఉత్తీర్ణత సాధించారు. ఐదో సెమిస్టర్‌లో బీఏలో 238 మందికి 213 మంది, బీఎస్సీలో 3647 మందికి 1486, బీబీఏలో 12కి 8 మంది, బీసీఏలో రెండుకు రెండు, బీకాం ఒకేషనల్‌లో 492లో 99, బీకాం జనరల్‌లో 95కి 76 మొత్తం 4486 మందికి 1884 మంది ఉత్తీర్ణత సాధించారు.

కేజీబీవీల్లో పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉపాధ్యాయ పోస్టులకు కలెక్టరేట్‌లో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జేసీ ఎం.నవీన్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరిపారు. ఆర్‌వీఎం ఏపీసీ ఆర్.జయప్రకాష్, డీఈఓ తిరుమల చైతన్య, సబ్జెక్టు నిపుణులు డెమో ద్వారా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి 10గంటల వరకూ ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా తొలిరోజున పీజీటీ విభాగంలో బోటనీ, కెమిస్ట్రీ, ఒకేషనల్, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్, ఇంగ్లీషు, మ్యాథ్స్, ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ అభ్యర్థులు 138 మందికి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

బ్యాడ్మింటన్ పోరుకు సన్నద్ధం



వివరాలు వెల్లడిచేస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

- ఈ నెల 15, 16 తేదీల్లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు
- ఆరు విభాగాల్లో పోటీలు
- బ్యాడ్మింటన్ టోర్నీల క్యాలెండర్ విడుదల



బాడ్మింటన్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: షటిల్ బ్యాడ్మింటన్ కొత్త సీజన్ షురూ కానుంది. జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్ణయించింది. ఈ మేరకు శనివారం శ్రీకాకుళం శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియంలో జరిగిన సంఘ విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానించారు. వివిధ జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల కోసం జిల్లా క్రీడాకారుల ఎంపికలను పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించారు. అండర్–11, 13, 15, 17, 19 బాలబాలికల వయో విభాగాలతో పాటు సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరగనున్నాయి. క్రీడాకారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. వసతి, భోజన సదుపాయాలను ఉచితంగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్ తెలిపారు. సంఘ చైర్మన్ ఆర్.రాజేంద్రన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సీఈవో సంపతిరావు సూరిబాబు, డాక్టర్ మధు విలేకర్, దామోదరరావు, గురుగుబెల్లి ప్రసాద్, అనిల్‌కుమార్, కేఎస్ఎన్ శైలానీ, సంతోష్, పిట్టా వాసు, శాంతికుమార్, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంట్రీల నమోదు ఇలా..

అండర్–11,13,15,17,19, సీనియర్స్ విభాగాల్లో ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు ముందుగా కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్(94404 13199), సీఈవో సంపతిరావు సూరిబాబు(94402 55255) నంబర్లను సంప్రదించి ఎంట్రీలు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది.

స్టేట్‌మీట్‌ల షెడ్యూల్ ఇది..

- అండర్–17: నెల్లూరు వేదికగా ఈనెల 22 నుంచి 25 వరకు
- అండర్–19: తిరుపతి వేదికగా ఈనెల 28 నుంచి 31 వరకు
- సీనియర్స్: వైఎస్సార్ కడప వేదికగా ఆగస్టు 3 నుంచి 6 వరకు
- అండర్–15: విశాఖపట్నంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 3 వరకు
- అండర్–13: ఒంగోలులో సెప్టెంబర్ 7 నుంచి 10 వరకు
- అండర్–11: తూర్పుగోదావరి జిల్లాలో సెప్టెంబర్ 14 నుంచి 17 వరకు
- స్టేట్ టోర్నమెంట్: 2024 జనవరి 25 నుంచి 28 వరకు ఏపీ స్టేట్ సీనియర్స్ పురుషులు, మహిళల టోర్నమెంట్
- నేషనల్ మీట్: అండర్–15, అండర్–17 విభాగంలో యునెక్స్ సీనియర్స్ ఆలిండియా సబ్–జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్ విజయవాడ వేదికగా అక్టోబర్ 24 నవంబర్ ఒకటి వరకు జరగనుంది.

లక్ష్యంతో ముందుకు సాగాలి



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఎలక్ట్రావ్ -2023 ఫెస్ట్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనకు వచ్చిన వినూత్న ఆలోచనలు ఇతర విద్యార్థులతో పంచుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ కొర్ల మోహనకృష్ణ, విభాగాధిపతి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ టూరిజం ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి

అరసవల్లి: జిల్లాలో అన్ని హోటల్స్, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్, బ్యూటీపార్లర్లు, లాడ్జిలు, ట్రావెల్ ఏజెన్సీలు, జిమ్ సెంటర్లు తదితర వ్యాపారాలు నిర్వహిస్తున్న వారంతా ఏపీ టూరిజం ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ జీఓ 188 జారీ చేసిందని శనివారం తెలిపారు. వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లకు దరఖాస్తులు చేయాలన్నారు. ట్రేడ్ సర్టిఫికెట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధి, సతి పేరిట ప్రత్యేక సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 6309942033, 965217925 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మెరిట్ లిస్ట్ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీపీఎస్సీ ద్వారా శ్రీకాకుళం జిల్లాకు కేటాయించిన అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ అభ్యర్థుల పూర్తి మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు అర్హత కలిగిన అభ్యర్థుల 1:2 నిష్పత్తి జాబితాను కలెక్టరు కార్యాలయం నోటీస్ బోర్డు, శ్రీకాకుళం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 9న ఉదయం 10గంటలకు పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, కుల ధ్రువీకరణపత్రం, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సరిఫికెట్లు, హాల్‌టికెట్, విభిన్న ప్రతిభావంతులైతే సదరం సర్టిఫికెట్, బీసీ అభ్యర్థులు ఓబీసీ/నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్, మిగిలిన వారు సంబంధిత పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

వడదెబ్బకు దివ్యాంగుడు మృతి



మురకాడ పారయ్య మృతదేహం

బూర్జ: మండలంలోని లాభాం గ్రామానికి చెందిన మురకాడ పారయ్య (52) అనే దివ్యాంగుడు వడదెబ్బకు గురై శనివారం మృతి చెందాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..నాగావళి నదిలో స్నానానికి వెళ్లిన పారయ్య ఎండకు తట్టుకోలేక సకాలంలో తాగునీరు అందక గ్రామ సమీపంలోని కాలువ వద్ద పడి మృతి చెందాడు. సాయంత్రం వరకు పారయ్య తిరిగి రాకపోవడంతో యువకులు పరిసర ప్రాంతాల్లో వెతకగా కాలువ వద్ద విగతజీవిగా కనిపించాడు. అనంతరం పారయ్య కుమారుడు రామ్‌కు సమాచారం అందజేశారు.

కుమారుడిని చంపిన కేసులో తండ్రి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదాం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుప్పిలి గ్రామంలో కొంద్రు తాతారావు (26) హత్య కేసులో నిందితుడు, మృతుడి తండ్రి కొంద్రు కుప్పేసును జేఆర్ పురం సీఐ ఆదాం, ఎస్సై సత్యనారాయణ శనివారం అరెస్టు చేశారు. అనంతరం మీడియా ముందు ప్రవేశపెట్టారు. కుప్పిలి పరిసరాల్లో నిందితుడి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. భార్య, కుటుంబ సభ్యులపై కక్షతోనే కుప్పేసు ఈ హత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు.

9న ఫ్యాప్టో జిల్లా సదస్సు



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 9న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరగనున్న జిల్లాస్థాయి సదస్సును విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా చైర్మన్ మజ్జి మదన్‌మోహన్ పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాకుళంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సుకు ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ మంజుల తదితరులు హాజరుకానున్నట్టు చెప్పారు. పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని, అస్తవ్యస్తంగా ఉన్న జీవో 117 రద్దుచేయాలని, 11వ పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2022 పీఆర్సీ ప్రకారం మినిమం టైం స్కేల్ వేతనం మంజూరు చేయాలని కోరుతూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ కొమ్ము అప్పలరాజు, ప్రతినిధులు పొందూరు అప్పారావు, ఎస్వీ రమణమూర్తి, టి.చలపతిరావు, ఎస్.గోవిందరాజులు, పి.రామ్మోహన్, పి.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కాలయాపన చేసి కాలు తీసేస్తామంటారా?

- వైద్యుడు, సిబ్బంది తీరుపై క్షతగాత్రుడి బంధువుల మండిపాటు



వైద్యుడు రాజేష్‌తో వాగ్వాదానికి దిగిన క్షతగాత్రుడి బంధువులు

టెక్కలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో పెనుమార్పులు తీసుకువచ్చి పేద ప్రజలకు మంచి వైద్యం అందించాలని చూస్తున్నప్పటికీ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో కొందరు వైద్యులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శనివారం ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. శుక్రవారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడ గ్రామానికి చెందిన వాండ్రాసి ధనసాయి అనే యువకుడు డెలివరి బాయ్ పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వెళ్తుండగా లింగాలపాడు సమీపంలో మరో బైకు ఢీకొనడంతో గాయపడ్డాడు. ఈ ఘటనలో కాలు తీవ్రంగా దెబ్బతినడంతో ధనసాయిని స్థానిక ఆసుపత్రిలో చూపించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఉదయం వైద్యులు వచ్చి చూస్తారని చెప్పి సెలైన్ పెట్టారు. మరుసటి రోజు(శనివారం) ఉదయం 11 గంటల సమయంలో వైద్యుడు రాజేష్ వచ్చి కాలు నుజ్జయిందని, కాలు తీసేయాల్సి ఉంటుందని చెబుతూ సంబంధిత కాగితాలపై సంతకం పెట్టాలని, లేదంటే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తామని చెప్పారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు మండిపడ్డారు. శుక్రవారం రాత్రి ఆస్పత్రికి తీసుకువచ్చే ఇంతవరకు ఎటువంటి వైద్యం చెయ్యకుండా చివరకు తన కుమారుడి కాలు తొలగించాలని చెప్పడం సరికాదంటూ ఆందోళనకు దిగారు. అనంతరం పోలీసులు చొరవతో బాధితుడిని శ్రీకాకుళం తరలించారు. ఈ విషయమై వైద్యుడు రాజేష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు మాట్లాడుతూ క్షతగాత్రుడు వచ్చినప్పటి నుంచి ఆస్పత్రి సిబ్బంది సేవలు అందిస్తునే ఉన్నారని స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న 'రైతే రాజు' నాటక ప్రదర్శన



ఇంజరాపు రమణారావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం



రైతేరాజు నాటికలో ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిరంలో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 285వ కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్‌కు చెందిన కళాంజలి సంస్థ ప్రదర్శించిన 'రైతేరాజు' నాటిక ఆద్యంతం అలరించింది. కంచర్ల సూర్యప్రకాశరావు రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. అంతకుముందు సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇ.అనూరాధ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. రిటైర్డ్ అడిషనల్ జాయింట్ కలెక్టర్ ఆర్.గున్నయ్య, రిటైర్డ్ ఏసీటీఓ కిల్లాన ఫల్గుణరావు, గోండ్ల తెలికుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.ఎల్.ప్రసాద్‌లు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం వసతి గృహ సంక్షేమాధికారిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన, నటుడు ఇంజరాపు రమణారావు దంపతులను ఘనంగా సత్కరించారు. పేద కళాకారులకు నెలవారి పింఛను, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిక్కు హరిసత్యనారాయణ, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, నిక్కు అప్పన్న, సత్యవతి, కలగ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యం



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న స్పీకర్, కలెక్టర్లు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- ఇరు జిల్లాల కలెక్టర్లతో కలిసి ఓనిగెడ్డ మినీ రిజర్వాయర్ సందర్శన

పాలకొండ: పాలకొండ–బూర్జ మండలాల రైతుల సాగునీటి ఆదరువు ఓని గెడ్డ మినీ రిజర్వాయర్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. రూ.12కోట్ల అంచనా వ్యయంతో పనులు జరిపేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించామని వివరించారు. ఓని గెడ్డ మినీ రిజర్వాయర్‌ను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు శ్రీకేష్‌లాఠకర్, నిషాంత్‌కుమార్, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మినీ రిజర్వాయర్ ఆవశ్యకతను వివరించారు. సుమారు 23 కిలో మీటర్లమేర ఉన్న సాగునీటి కాలువల ద్వారా పాలకొండ మండలంలో 1500 ఎకరాలకు, బూర్జ మండలంలో 7వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని వివరించారు. షెట్టర్లు పూర్తిగా పోవడంతో నీరు కాలువలోకి రావడంలేదని తెలిపారు. వెంటనే షట్టర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇరు జిల్లాల కలెక్టర్లు తెలిపారు. సాగునీటి కాలువలో పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వం సాగునీటి వనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. రిజర్వాయర్ ఆధునికీకరణ పనుల అంశాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన స్పందించి వెంటనే అంచనాలు తయారు చేయాలని జలవనరుల శాఖ అధికారులకు ఆదేశించారన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నామని, పనుల అంచనాలు అందించాలని ఇరుజిల్లాల కలెక్టర్లు జలవనరుల శాఖ ఎస్ఈ సుధాకర్‌ను ఆదేశించారు. వీరితో పాటు జలవనరులశాఖ డీఈఈ రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

కిడ్నీ బాధితులకు మెరుగైన సేవలే లక్ష్యం



కవిటిలో కొత్త డయాలసిస్ మిషన్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త పిరియా సాయిరాజ్

కవిటి: ఉద్దానం కిడ్నీబాధితులకు కవిటి డయాలసిస్ కేంద్రంలో నిరంతర, నాణ్యమైన, వేగవంతమైన సేవలే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వక్తలు పేర్కొన్నారు. కవిటి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని డయాలసిస్ కేంద్రానికి పెరిగిన డయాలసిస్ మిషన్ల సామర్థ్యానికి తగినట్టుగా విద్యుత్ సమస్య ఎదురు కాకుండా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను, జిల్లా కలెక్టర్ చొరవతో నూతనంగా మంజూరైన రెండు కొత్త డయాలసిస్ మిషన్లను ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు శనివారం ప్రారంభించారు. ప్రస్తుతం 17 డయాలసిస్ మిషన్లతో 106 మంది రోగులకు నిరంతరాయంగా సేవలు అందుతున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.రామ్‌జీ తెలిపారు. త్వరలో కాశీబుగ్గలో కిడ్నీవ్యాధుల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉద్దానంలో కిడ్నీవ్యాధులపై మరింత ప్రగతి సాధించే వీలుంటుందని పేర్కొన్నారు. ఉద్దానం ప్రజలకు రూ.700 కోట్ల నిధులతో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రభుత్వం శరవేగంగా పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కడియాల ప్రకాష్, దుక్క లోకేశ్వర రెడ్డి, దేవరాజ్ సాహు, బి.జయప్రకాష్, పి.లక్ష్మణరావు, పి.నీలాచలం, కృష్ణరాళో, రమణమూర్తి, బి.నాగు తదితరులు పాల్గొన్నారు.


థ్యాంక్యూ జగనన్న



రెక్కాడితే డొక్కాడని పేదలకు మీరిస్తున్న అమ్మఒడి పథకం, జగనన్న విద్యాకానుక, విద్యాదీవెన, వసతిదీవెన పథకాలు వరంలా మారి విద్యా వెలుగులు ప్రసాదిస్తున్న మీకు 'థ్యాంక్యూ జగనన్న' అని చెప్పడం తప్ప మరొకటి లేదని చిన్నారులు నినదించారు. తమ తల్లుల ఖాతాలో అమ్మ ఒడి పథకం నిధులు జమచేసిన నేపథ్యంలో శనివారం పెద్ద ఎర్ర గోవిందపుట్టుగ చిన్నారులు ఇలా ఆనందం వ్యక్తం చేశారు. హెచ్‌ఎం బెజ్జిపల్లి దేవదాస్ తదితరులు పాల్గొన్నారు. – కవిటి

బిర్యానీదే హవా

- ఫంక్షన్ ఏదైనా అటెన్షన్ బిర్యానీదే
- జిల్లాలో 20 రకాలకుపైగా బిర్యానీలు లభ్యం
- నిమిషానికి పది బిర్యానీలు ఆర్డర్ పెట్టి తింటున్న వైనం
- నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం




శ్రీకాకుళం:

బారసాల నుంచి దశ దిన కర్మల వరకు, పుట్టిన రోజు నుంచి పెళ్లిళ్ల వరకు ఫంక్షన్ ఏదైనా అటెన్షన్ అంతా బిర్యానీలదే. ఈ వంటకం ఎంతబాగా కుదిరితే కార్యం అంత చక్కగా జరిగినట్టు. అందులోనూ హైదరాబాదీ బిర్యానీ అంటే సిక్కోలు వాసులు లొట్టలేసుకుని తింటున్నారు. ఒకప్పుడంటే ఈ బిర్యానీ దొరకడం కష్టంగా ఉండేది గానీ.. ఇప్పుడు దాదాపు అన్ని ఊళ్లలోనూ బిర్యానీ సెంటర్లు కనిపిస్తున్నాయి. జిల్లాలో దాదాపు 20 రకాల బిర్యానీలు దొరుకుతున్నాయి. నేడు ప్రపంచ బిర్యానీ దినోత్సవం.

- రూ.100 నుంచి రూ.700లకు పైబడి బిర్యానీ ధర ఉంది.
- జిల్లాలో నిమిషానికి 10 బిర్యానీలు ఆన్‌లైన్ ఆర్డర్‌లు వస్తున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది.

వెజ్ అయినా.. నాన్‌వెజ్ అయినా..



ఎర్రటి మాంసం ముక్కలు కనిపిస్తేనే బిర్యానీ మజా ఇస్తుందనుకుంటే పొరపాటే.. పుట్టగొడుగుల నుంచి పన్నీరు వరకు, ఆవకాయ నుంచి గోంగూర వరకు పలు రకాల బిర్యానీలు చికెను, మటను బిర్యానీలకు గట్టి పోటీ ఇస్తున్నాయి. ఇటీవలే ప్లాంట్‌బేస్డ్ చికెన్, మటన్ పేరిట బిర్యానీలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇవి శాకాహారమే. మాంసాహార విషయానికి వస్తే హైదరాబాదీ దమ్‌బిర్యానీతో పాటు పొట్లం బిర్యానీ, మటన్, ప్రాన్ బిర్యానీలంటూ రకరకాలు నోరూరిస్తున్నాయి.

హైదరాబాద్ బిర్యానీకే ఆదరణ





ఎన్నో రకాలు బిర్యానీలు ఉన్నా హైదరాబాద్ దమ్ బిర్యానీకి ఉన్న ఆదరణ ప్రత్యేకం. అన్ని బిర్యానీల్లో యాభై శాతం ఇవే వెళ్తాయి. వెజ్, నాన్ వెజ్‌ల బిర్యానీలలో దమ్‌కే ప్రథమస్థానం.

– తపన్‌కుమార్, బాబూరావు,చెఫ్‌లు

బిర్యానీ అంటే ఎంతో ఇష్టం



ప్రతి వారం చివర్లో బిర్యానీ తప్పక తింటాను. బిర్యానీ అంటే అంత ఇష్టం. ఆహార ప్రియుల అభిరుచి మేరకు తయారీదారులు కూడా రకరకాల రుచులను అందుబాటులోకి తెస్తున్నారు. ఇది మావంటి వారికి సంతోషం. – ఇప్పిలి సురేష్, శ్రీకాకుళం